తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
30-04-2024
మంగళవారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 252 | పేజీలు : 8 | వెల : 4

జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889
జయభేరి



# జూన్ 2 తర్వాత హైదరాబాద్.. యూటీ..?

## కలకలం రేపుతున్న కేటీఆర్ కామెంట్స్

జూన్ 2 తరువాత హైదరాబాద్ ను కేంద్ర పాలిత ప్రాంతం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్ను కాపాడుకోవాలన్నా, రాజ్యాంగాన్ని మార్చకుండా అడ్డుకోవాలన్న శక్తి బీఆర్ఎస్ పార్టీకి మాత్రమే ఉందన్నారు. కరీంనగర్ జరిగిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని కేటీఆర్ ప్రసంగించారు. కరీంనగర్ ఎంపీగా వినోద్ కుమార్ గెలవటం ఖాయమేనని, బండి సంజయ్ షెడ్ కు పోవటం ఖాయమే కదా? అన్నారు. నిన్న మొన్నటి దాకా గౌరవమిచ్చిన పోలీసులు ఇప్పుడు తోక జాడిస్తున్నారంటూ మండిపడ్డారు. లోక్సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు 10, 12 సీట్లు రావాలి. అప్పుడు మళ్లీ కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారు.

...మిగతాది 2 లో

# రేవంత్ కు ఢిల్లీ పోలీసుల నోటీసులు



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పోలీసులు సమన్లు ఇచ్చారు. అమిత్ షాకు చెందిన ఓ ఫేక్ వీడియో కేసులో ఢిల్లీ పోలీసులు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ కాంగ్రెస్ విభాగం ఆ వీడియోను బాగా వైరల్ చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. అమిత్ షా సిద్దిపేట సభలో వ్యాఖ్యలను వక్రీకరించారని ఆరోపిస్తున్నారు. రిజర్వేషన్లు తొలగిస్తాం అన్నట్లుగా వీడియోను రూపొందించారు. ఈ వ్యవహారంపై కేంద్ర హెంమంత్రిత్వ శాఖ సీరియస్ అయి విచారణకు ఆదేశించినట్లు సమాచారం. అందులో భాగంగానే ఢిల్లీ పోలీసులు రేవంత్ రెడ్డికి సమన్లు ఇచ్చారు. మే 1న విచారణకు హాజరు కావాలని ఆదేశించినట్లు తెలిసింది.

...మిగతాది 2 లో



# కేసీఆర్.. ఎందుకిలా శాసించేస్థాయి.. నుంచి

జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 29 :

పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడని ఎమ్మెల్సీ రాములు నాయక్ ని గెంటేశారు. కుంభకోణానికి పాల్పడ్డాడని అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి రాజయ్యను బర్తరఫ్ చేశారు. తమకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడని హెల్త్ మినిస్టర్ ఈటల రాజేందర్ పై భూకబ్జా ఆరోపణలు చేశారు. ఆయనను మంత్రివర్గం నుంచి తప్పించారు.. పార్టీ లైన్ కి వ్యతిరేకంగా ఉన్నాడని బాబూ మోహన్ కు పొమ్మన లేక పొగ పెట్టారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఎన్నెన్నో.. తనను, తన నాయకత్వాన్ని ధిక్కరించే ఏ వ్యక్తికైనా సరే కెసిఆర్ చుక్కలు చూపించారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక ఆట ఆడుకున్నారు. పార్టీలో ఏమాత్రం తేడా అనిపించినా వెంటనే చర్యలకు ఉపక్రమించేవారు. ఎంతటి వారైనా సరే ఉపేక్షించేవారు కాదు. మరి ఇప్పుడు?క్రమశిక్షణను పదేళ్లపాటు పకడ్బందీగా అమలు చేసిన కేసీఆర్.. ఇప్పుడు పార్టీపై పట్టు కోల్పోతున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. నేతలు తమ వ్యవహార శైలితో లైన్ దాటుతున్నప్పటికీ కెసిఆర్ ఏమీ చేయలేకపోతున్నారు. జస్ట్ ఒక ప్రేక్షకుడిగా చూస్తుండి పోతున్నారు. అధికారం కోల్పోవడంతో కీలక నాయకులు మొత్తం కాంగ్రెస్ పార్టీలోకి జంప్ అయ్యారు. ఉన్న ఎమ్మెల్యేలలో కొంతమంది కండువా మార్చేందుకు సిద్ధంగా ఉన్నారు. తనకు అత్యంత సన్నిహితులైన నేతలు పార్టీ వీడుతుంటే.. కెసిఆర్ నిస్సహాయ స్థితిలో ఉన్నారు. కడియం శ్రీహరి, దానం నాగేందర్, రంజిత్ రెడ్డి, ప్రకాష్ గౌడ్ వంటి వారు

...మిగతాది 2 లో

# ఖర్గేను గెలిపించండి

జయభేరి, బెంగళూరు, ఏప్రిల్ 29

కర్ణాటకలోని గుర్మిట్కల్ లోక్ సభ ఎన్నికల ప్రచార సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ నియోజకవర్గం నుంచి తొమ్మిదిసార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎంపీగా మల్లిఖార్జున ఖర్గే గెలిచారు. 1972లో మొదటిసారిగా మీరు ఎన్నుకున్న మల్లికార్జున ఖర్గే.. ఏఐసీసీ అధ్యక్షుడుగా ఇప్పుడు దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు సీఎం రేవంత్ రెడ్డి. గుర్మిట్కల్ ప్రజల ఆశీర్వాదం వల్లే ఆయన ఈ స్థాయికి చేరుకున్నార న్నారు. మీరు ఇచ్చిన స్పూర్తితో కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని ప్రజలపై ప్రశంసల వర్షం కురిపించారు. ఐదు గ్యారంటీలను కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా అమలు చేసిందన్నారు. తెలంగాణలోనూ ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలను ఇప్పటికే అమలు చేశామన్నారు. పదేళ్లలో మోదీ ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. నల్లధనాన్ని తెచ్చి

...మిగతాది 2 లో






# ఇసుక అక్రమాల పై సుప్రీం సీరియస్

జయభేరి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 29

అక్రమ ఇసుక తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలని అనుమతులు ఉన్న చోట కేవలం మాన్యువల్ గా మాత్రమే ఇసుకను తీయాలని ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అక్రమాలకు పాల్పడిన వారిపై నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఎన్జీటిని సుప్రీంకోర్టు ఆదేశించింది. అక్రమ ఇసుక తవ్వకాలు జరపడం లేదని అఫిడవిట్ రూపంలో ఇవ్వాలని కాంట్రాక్ట్ సంస్థ జేపీ వెంచర్స్కు కూడా ఆదేశాలు జారీచేసింది. పిటీషనర్ నాగేంద్ర కుమార్ అక్రమ ఇసుక తవ్వకాలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని సూచించింది. పిటీషనర్ ఫిర్యాదులపైన వెంటనే చర్యలు తీసుకోవాలని కూడా ఏపీ ప్రభుత్వానికి

...మిగతాది 2 లో



# వేగంగా విస్తరిస్తున్న బర్డ్ ఫ్లూ...

జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 29:

జార్ఖండ్లో బర్డ్ ఫ్లూ వేగంగా వ్యాపిస్తుంది. దీంతో చికెన్, కోడిగుడ్ల విక్రయంపై ఆ రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. రాంచీలోని ప్రభుత్వ పౌల్ట్రీ ఫామ్లో బర్డ్ ఫ్లూ కేసులు కనిపించడంతో జార్ఖండ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. అదే సమయంలో, కోళ్లు, బాతులలో బర్డ్ ఫ్లూ వైరస్ ఉందని తేలడంతో ప్రభుత్వ పౌల్ట్రీ ఫామ్ హోత్వార్లో 1745 కోళ్లు, 450 బాతులు సహా దాదాపు 2195 పక్షులను చంపేయాలని ఆదేశించింది. 1 కిలోమీటరు పరిధిలో ఎలాంటి కోళ్లు, బాతులు, గుడ్లు కనిపించినా.. వాటిని ఇక్కడికి తీసుకొచ్చి ధ్వంసం చేయాలని అడ్మినిస్ట్రేషన్ టీమ్ ఆదేశించింది. సాధారణ వైరస్ల మాదిరిగానే, ఈ వైరస్ జంతువులు, పక్షులతో పాటు మానవులకు కూడా సోకగల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి, రాంచీలోని ప్రభుత్వ పౌల్ట్రీ ఫారమ్లో బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయిన వెంటనే, అక్కడ పనిచేస్తున్న పౌల్ట్రీ ఫామ్లోని 2 వైద్యులతో సహా 6 మంది ఉద్యోగులు క్వారంటైన్ చేశారు. కోళ్లను ఒక చోట నుంచి మరో చోటికి తీసుకురావడం, రవాణా చేయడంపై కూడా పూర్తి నిషేధం విధించింది.

▸▸ మొదటిపేజీ తరువాయి

## జూన్ 2 తర్వాత హైదరాబాద్.. యూటీ..?

కరీంనగర్ ను అభివృద్ధి చేసేందుకు గంగుల కమలాకర్ కష్టపడ్డారు. ఆయనకు 3 వేల మెజార్టీ రావటం బాధగా అనిపించింది. బీజేపోళ్లు 10 మంది కూడా ఉండరని, కానీ మనం వార్డుకు 3 వందల మంది వరకు ఉంటాం అయినా ఒకరి పేరు చెబితే ఒక్కరికి కోపం వస్తుంది, అలా ఉండొద్దని సూచించారు. మనకు ఒక్క సీటు రాదంటున్నాడు రేవంత్ రెడ్డి. మనం 2 సీట్లు గెలిస్తే కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి రాజీనామా చేస్తానని అంటాడు. ఇక్కడ వినోదన్న గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంట అని బండి అంటున్నాడు. వినోదన్నను గెలిపించి బండి రాజకీయ సన్యాసం తీసుకునేలా చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. 'సిరిసిల్ల, హుజురాబాద్ మంచిగనే ఉన్నాయి. కరీంనగర్, మానకొండూరు, చొప్పదండి లో కూడా బలంగా ఉండాలి. బడా భాయ్ హామీలు ఇచ్చి మోసం చేస్తే... ఇటు చోటా భాయ్ కూడా నోటికి వచ్చినట్లు చెప్పి మోసం చేసిండు. గీతా భవన్ చౌరస్తాలో నిలబడితే కాంగ్రెస్ క్యాండిడేట్ ను ఒక్కడన్న గుర్తుపడుతాడా? జీవన్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డిని కాదని ఎవరో ముక్కు మొఖం తెలియని వ్యక్తిని నిలబెట్టిన్రు. ఇది మ్యాచ్ ఫిక్సింగ్ కదా ? బండి సంజయ్ ని గెలిపించేందుకు రేవంత్, బండి సంజయ్ ఒక్కటయ్యారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటని కొందరు అంటరు. అసలు బీజేపీ తీస్ మార్ ఖాన్లను ఓడగొట్టిందెవరు? బీజేపీతో మనకు అండర్ స్టాండింగ్ ఉంటే కవిత జైల్లో ఉంటదా? 2014, 2019 లో బీజేపీ హవాను అడ్డుకున్నది కేసీఆర్ కాదా?' అని కేటీఆర్ ప్రశ్నించారు.మల్కాజ్ గిరి, చేవేళ్ల, కరీంనగర్, నిజామాబాద్ లాంటి ప్రాంతాల్లో బీజేపీ కోసం కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులను పెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. బండి సంజయ్ కి సబ్జెక్ట్ లేదని, బాష కూడా సరిగ్గా రాదు. కేవలం తెలిసిందల్లా జై శ్రీరామ్ అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. జడ్పీ మీటింగ్ లకు రాడు. లోక్ సభలో ప్రశ్నలు అడగడు. మనం కూడా జై తెలంగాణ, జై శ్రీరాం, జై భారత్ అందామని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. 'రాముడు కూడా రాజధర్మం పాటించాలని చెప్పిండు. కరీంనగర్ ప్రాంతానికి బండి సంజయ్ ఏం పని చేసిండు. కరీంనగర్ కు రూపాయి తేలేదు. ఒక్క శిలాఫలకం వేయలేదు. దేశాన్ని నాశనం చేస్తున్న బీజేపీని ఓడిస్తే దేవుళ్లు కూడా సంతోషిస్తారని వ్యాఖ్యానించారు. దేవుడి పేరుతో రాజకీయాలు చేసే వాళ్లకు బుద్ధి చెప్దాం. గాలి తిరుగుడు తిరిగే బండి సంజయ్ కు గుణపాఠం చెప్పాలె. రాహుల్ గాంధీ ప్రధాని మోదీని చౌకి దార్ చోర్ అంటే రేవంత్ రెడ్డి మాత్రం బడే భాయ్ అంటాడు. చోట భాయ్ కచ్చితంగా లోక్ సభ ఎన్నికల తర్వాత బీజేపీలో చేరతాడని' కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు.

## రేవంత్ కు ఢిల్లీ పోలీసుల నోటీసులు

భారతీయ జనతా పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఎత్తివేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెబుతున్నట్టుగా ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. నిజానికి అమిత్ షా అలా చెప్పలేదు. సిద్దిపేట సభలో అమిత్ షా ముస్లిం రిజర్వేషన్ల గురించి మాట్లాడారు. వాటిని తీసేసి ఎస్సీ, ఎస్టీలకు ఇస్తామన్నారు. కానీ ఆ వీడియోను ట్విస్ట్ చేసి ఎడిట్ చేసి అన్ని రిజర్వేషన్లు రద్దు చేస్తామన్నట్లుగా మార్చారు. సోషల్ మీడియాలో వైరల్ చేశారు.
నేరుగా కేంద్ర హోంశాఖ మంత్రి వీడియోనే మార్ఫింగ్ చేయడంతో బీజేపీ తీవ్రంగా స్పందించింది. పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు మార్ఫింగ్ చేసి, వీడియోను వైరల్ చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముందుగా ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. తర్వాత హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు కూడా కేసు నమోదు చేశారు.
అమిత్ షా మాట్లాడిన అసలు వీడియోను బీజేపీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. తెలంగాణలో ముస్లింలకు ఉన్న రాజ్యాంగ విరుద్ధ రిజర్వేషన్లను మాత్రమే రద్దు చేస్తామని అమిత్ షా చెప్పారని, వైరల్ అవుతున్న వీడియోను ఎడిట్ చేశారని స్పష్టం చేసింది. ఈ ఎడిటెడ్ వీడియోపై ఏబీపీ దేశం కూడా ఫ్యాక్ట్ చెక్ చేసింది. అమిత్ షా వీడియో ఫేక్ అని నిర్ధారించింది. ఏబీపీ దేశం ఫ్యాక్ట్ చెక్ కథనాన్ని ఇక్కడ క్లిక్ చేయడం ద్వారా చేయడం చూడవచ్చు.
ఫేక్ వీడియోలపై ఢిల్లీ పోలీసులు ఆదివారం రోజున కేసు నమోదు చేశారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు విషయంలో త్వరలో దేశవ్యాప్తంగా అరెస్టులు ఉండే అవకాశం ఉందని వెల్లడించారు. సదరు వీడియోలను షేర్ చేసిన వారిని అదుపులోకి తీసుకోవచ్చని అంటున్నారు.ఎడిట్ చేసి దుష్ప్రచారం చేస్తున్న ఇలాంటి వీడియోల వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందని ఫిర్యాదులో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తెలిపింది. వీడియోలను ఎక్కడి నుంచి షేర్ చేశారో తెలియజేసే కొన్ని లింకులను కూడా జత చేసినట్లు తెలిపింది. బహిరంగసభ హైదరాబాద్లో జరిగింది కావడంతో హైదరాబాద్ లోనే మార్ఫ్ చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. కాంగ్రెస్ హ్యాండిల్సే ముందుగా ప్రచారం చేయడంతో కాంగ్రెస్ నేతల ప్రమేయం లేదా కాంగ్రెస్ సోషల్ మీడియా ప్రమేయం ఉంటుందని భావిస్తున్నారు. ఈ వీడియో వైరల్ అయిన తర్వాత కాంగ్రెస్ నేతలు మరితం ఎక్కువగా రాజ్యాంగ మార్పు, రిజర్వేషన్ల రద్దుపై మాట్లాడుతున్నారు. ీకారణంగా ఇదంతా వ్యూహాత్మకంగా చేస్తున్న ఫేక్ ప్రచారంగా బీజేపీ అనుమానిస్తోంది.

## కేసీఆర్.. ఎందుకిలా..

కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తే.. కనీసం వారిని ఆపేందుకు కూడా కెసిఆర్ ప్రయత్నించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.. ఇవి ఇలా ఉండగానే.. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లా రెడ్డి పార్టీ లైన్ కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సికింద్రాబాద్, మాల్కాజ్ గిరి పార్లమెంట్ స్థానాలపై భారత రాష్ట్ర సమితి భారీగా ఆశలు పెట్టుకున్న నేపథ్యంలో.. మల్లారెడ్డి ఒక్కసారిగా తన వ్యాఖ్యలతో వాటిపై నీళ్లు చల్లాడు. మీడియా ప్రతినిధులు చూస్తుండగానే మల్కాజ్ గిరి భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ ను ఆ లింగనం చేసుకున్నాడు. అంతేకాదు మల్కాజ్ గిరి స్థానంలో రాజేందర్ గెలుస్తున్నాడంటూ వ్యాఖ్యలు చేశాడు. వాస్తవానికి అధికారంలో గనుక ఉండి ఉంటే.. ఇటువంటి చర్యలకు పాల్పడిన ప్రజాప్రతినిధిపై కేసీఆర్ కచ్చితంగా వేటు వేసేవారు. కానీ, ఇప్పుడు అంత సన్నివేశం ఉన్నట్టు కనిపించడం లేదు. పార్టీకి నష్టం చేకూర్చే విధంగా మల్లారెడ్డి వ్యాఖ్యలు చేసినప్పటికీ కెసిఆర్ ఎటువంటి చర్యలకు ఉపక్రమించలేదు. పార్టీకి నష్టం చేకూర్చే నాయకులపై కేసీఆర్ ఈ స్థాయిలో ఉదాసీనత ప్రదర్శించడం నిజంగా ఆశ్చర్యంగా ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈటల గెలుస్తున్నాడని మల్లారెడ్డి చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇక దీనిపై కాంగ్రెస్ కూడా గట్టిగానే కౌంటర్ ఇస్తోంది. బీఆర్ఎస్, బిజెపి ఒకటే అని ఎందుకు ఇది ఒక ఉదాహరణ అని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ వీడియోను మీపరితంగా సర్కులేట్ చేస్తున్నారు. పాలు నీళ్లు లాగా భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ నాయకులు కలిసిపోయారని వ్యాఖ్యలు చేస్తున్నారు. మరి దీనిపై బిజెపి ఎలాంటి కౌంటర్ ఇస్తుందో వేచి చూడాల్సి ఉంది. అన్నట్టు ఈ వ్యవహారంపై భారత రాష్ట్ర సమితి అనుకూల మీడియా మౌనాన్ని పాటించింది. ఆ పార్టీ సోషల్ మీడియా విభాగం కూడా ష్‌గప్ చుప్ అన్నట్టుగా వ్యవహరించింది. ఇతర పార్టీల నాయకులు ఏం చేసినా భూతద్దంలో వెతికే గులాబీ అనుకూల మీడియా.. ఈ విషయంలో సైలెంట్ గా ఉండడం.. ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు

## ఖర్గేను గెలిపించండి

ప్రజల ఖాతాల్లో వేస్తామన్న మోదీ మాట తప్పారన్నారు. 40కోట్ల ఖాతాలు తెరిపించిన మోదీ.. ఒక్క పైసా కూడా పేదల ఖాతాల్లో వేయలేదన్నారు.కర్ణాటక నుంచి 26ఎంపీలను ఇస్తే.. మోదీ కర్ణాటకకు కేవలం ఒకటే కేబినెట్ పదవి ఇచ్చారన్నారు. మోదీ కర్ణాటకకు ఇచ్చింది ఏమీ లేదు.. ఖాళీ చెంబు తప్ప అని ఎద్దేవా చేశారు. కరువు వస్తే కనీసం బెంగుళూరుకు నీళ్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు. అలాంటి మోదీని ఓడించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ప్రజలకు అండగా ఉండే కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని సూచించారు. ఇక్కడ కాంగ్రెస్‌కు ఒక్క ఓటు వేస్తే.. ముగ్గురు నాయకులు మీకు సేవ చేస్తారన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు రద్దు చేసేందుకే మోదీ 400 సీట్లు కావాలంటున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లు కావాలనుకుంటే కాంగ్రెస్‌కు ఓటు వేయండన్నారు సీఎం రేవంత్. ఖర్గే నేతృత్వంలో కాంగ్రెస్‌ను లక్ష మెజారిటీతో గెలిపించండని కోరారు.

# దేశంలో ప్రశాంతమైన వాతావరణానికి కారకుడు మోడీ




✍ **జయభేరి, ఘట్కేసర్ :**
నారపల్లి కాలనీవాసుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఈటల రాజేందర్. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ... తాజా, మాజీ ముఖ్యమంత్రులు ఇద్దరు అబద్ధాలు మాయమాటలు చెప్తున్నారు. అబద్ధాలతో ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారు అప్రమత్తంగా ఉండండి. బిజెపి అంటే ఏదో మతోన్మాద పార్టీ, ఈ పార్టీ అధికారంలోకి వస్తే దేశం ముక్కలైపోతది, దేశం అల్లకల్లోలం అయిపోతదని మోడీ రాకముందు దుష్ప్రచారం చేశారు. మోడీ వచ్చిన తర్వాత ఈ పది సంవత్సరాలు కాలంలో ఎక్కడ కూడా నరమేధం జరగలేదు, రక్తపాతం జరగలేదు, కమ్యూనల్ వైలెన్స్ జరగలేదు. గోకుల్ చాట్, లుంబిని పార్క్, సాయిబాబా టెంపుల్ ల్లాగా ఎక్కడా బాంబులు మూతలు లేవు. మోడీ వచ్చిన తర్వాత జమ్మూ కాశ్మీర్లో కూడా బాంబుల మూతలు లేవు, తుపాకీ శబ్దాలు లేవు. దేశంలో ప్రశాంతమైన వాతావరణానికి కారకుడు మోడీ. పాకిస్తాన్ ఆక్యుపైడ్ కాశ్మీర్, బల్చిస్తాన్ ప్రాంత ప్రజలు మేము కూడా భారత్ తో కలిసి ఉంటే బాగుండు, ఇక్కడున్నందుకు బాధపడుతున్న అని ఉద్యమం చేస్తున్నారాంటే మన దేశం యొక్క గొప్పతనం ఏంటో దాన్ని బట్టి అర్థమవుతుంది. ప్రపంచంలో స్ట్రాంగ్ లీడర్స్ లో ఒకరిగా మోదీ స్థానం సంపాదించుకున్నారు. ప్రపంచాన్ని శాషించిన రష్యా మన జోక్యం కోరుకునే స్థాయికి ఎదిగినం. మోదీ ప్రజల సెంటిమెంట్ రామమందిరం కట్టి జాతికి అందించారు. మౌలికవసతులు కల్పనచేసి అభివృద్ధి చేస్తున్నారు. ట్రిపుల్ తలాక్ రద్దు చేసి ముస్లిం మహిళలకు కూడా న్యాయం చేశారు. ఒక్కసారి గెలిచాక రెండవసారి గెలవడమే కష్టం కానీ మోదీకి మూడవసారి కూడా ఓట్లు వేస్తామని ప్రజలే చెప్తున్నారు. అది అంత సులువైనది కాదు. GST ని అమలు చేయాలని చెప్పి మన్మోహన్ సింగ్ భావించారు కానీ చేయలేకపోయారు, మోడీ గారు మాత్రం భయపడకుండా తక్షణమే అమలు చేసి 73 వేల కోట్ల ఆదాయాన్ని లక్షా 80 వేల కోట్లకు పెంచారు. ఈ అభివృద్ధి, ఈ వేగం, ఈ ప్రశాంతత ఇవన్నీ కొనసాగాలంటే మళ్ళీ మోడీ గారే ప్రధాన కావాలని దేశం కోరుకుంటుంది. కాబట్టి దాంట్లో భాగంగానే మల్కాజిగిరిలో నన్ను అభ్యర్థిగా నిలబెట్టారు.
ఈ నియోజకవర్గాన్ని సమగ్ర అభివృద్ధి చేయడంలో నా అనుభవం పూర్తిగా వాడతానని హామీ ఇస్తున్నాను. మాలాంటి వాళ్లకు ఇంకొక వ్యాపాకలు ఉండవు. ప్రజల మధ్యలో ఉండటం, ప్రజలకు ఏమైనా అవసరం వస్తే పిలిస్తే పలికే బిడ్డగా ఉండటం తప్ప రియల్ ఎస్టేట్ కోసం కాదు. కాబట్టి ఎమ్మెల్యే కావచ్చు, ఎంపీ కావచ్చు మంచి చట్టాలు చేసి ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలు గర్వించే పద్ధతిలో తన బిహేవియర్ ఉండాలి.
ఈ నియోజకవర్గన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంలో నా పాత్ర ఉంటుందని మాట ఇస్తున్నాను. ఇప్పుడున్న పరిస్థితులలో బీఆర్ఎస్ పార్టీకి, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ఏ మాత్రం లాభం లేదు. తెలంగాణలోని ఉద్యోగ అవకాశాలు, ఐటీ అభివృద్ధి, రోడ్లు, కార్యాలయాలు రావాలంటే బీజేపీ పార్టీ వల్లనే సాధ్యం. నేను నేరుగా ప్రధాని మోదీ వద్దకు వెళ్లి ఈ ప్రాంతంలోని సమస్యల పై నేరుగా చర్చించగలను. మీరందరూ విజ్ఞులు, బాగా ఆలోచించి మీ ఓటును కమలం పువ్వు గుర్తుపై వేసి గెలిపించవలసిందిగా ప్రార్థన.
ఈ కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి, బూత్ అధ్యక్షులు స్నేహ, నల్ల నరసింహారెడ్డి, వెంకట్ రెడ్డి, కౌన్సిలర్ మహేష్, నరసింహ, మండల అధ్యక్షుడు ప్రవీణ్, ప్రభంజన్ గౌడ్, శివరాజ్ గౌడ్, బసవరాజు గౌడ్, రత్నాకర్, అశోక్ ముదిరాజ్, మేకల శంకర్ ముదిరాజ్, దినేష్, జితేందర్ గౌడ్, మహేష్, నరసింహ, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమాల పై

సుప్రీం ధర్మాసం ఆదేశాలు జారీ చేసింది. అక్రమ ఇసుక తవ్వకాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ చట్టాల మేరకు ఎఫ్ఐఆర్ దాఖలు చేసినా చర్యలు తీసుకోవాలని ఆదేసించింది. తదుపరి విచారణ మే 10కి వాయిదా వేసింది. ఎన్నికలు ఉన్నందున అఫిడవిట్ దాఖలుకు సమయం ఎక్కువ కావాలని రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది సుప్రీంకోర్టును కోరారు. కానీ సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఎన్నికల కన్నా పర్యావరణ అంశాలే ముఖ్యమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్రంలో కేవలం 40 రీచ్లలో మాత్రమే మాన్యువల్ మైనింగ్ కు అనుమతి ఉంది. అయినా, 500పైగా రీచ్లలో యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ నెల 19వ తేదీన మేం పర్యటించిన సమయంలో గోదావరి నది వద్ద అక్రమ ఇసుక మైనింగ్ జరుగుతోందని ఎన్జీటీ విచారణలో తేలింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ గ్రామంలో జేసీబీలతో తవ్వకాలు సాగిస్తుండటాన్ని గుర్తించాం.గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఎలాంటి పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక మైనింగ్ జరుగుతోంది. ఈ ఏడాది జనవరి 17, 19 తేదీల మధ్య మేం పరిశీలించినప్పుడు... జీసీకేసీ ప్రాజెక్ట్స్ అండ్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ దాదాపు 2.2 టన్నుల కెపాసిటీ బకెట్ సైజు కలిగిన జేసీబీ, హిటాచీ యంత్రాలతో అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతోంది. రోజంతా ఎడతెరిపి లేకుండా ఈ తవ్వకాలు సాగుతున్నాయి. తవ్వకాలు జరుగుతున్న రీచ్లలో ఏ ఒక్కదానికీ పర్యావరణ అనుమతులు లేవు. రీచ్ల ఏర్పాటుకు కాలుష్య నియంత్రణ మండలి అనుమతులూ తీసుకోలేదు. గనుల శాఖ నుంచి సంబంధిత రీచ్లను లీజుకు తీసుకున్నట్లు కూడా లేదని గుర్తించింది. ఆంధ్రప్రదేశ్లో ఇసుక తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ గత ఏడాది తీర్పు ఇచ్చింది. మొత్తం 110 ఇసుక రీచ్లలో వెంటనే తవ్వకాలు నిలిపేయాలని ఆదేశించింది. ఇసుక తవ్వకాలపై నాగేంద్రకుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్పై విచారణ జరిపింది. సుప్రీంకోర్టు ఆదేశాలను ఎన్జీటీ తన తీర్పులో పేర్కొంది. భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు కేవలం అరణియార్ నదిలోని పద్దెనిమిది ఇసుక రీచ్లకే పరిమితం కాదని వెల్లడించింది. తమ అదేశాలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని, ట్రైబ్యునల్ తీర్పుకు వక్రభాష్యం చెప్పిందని అసహనం వ్యక్తం చేసింది. రాష్ట్ర పర్యావరణ అంచనా కమిటీ ఉత్తర్వులను అమలు చేయాలని ఎన్జీటీ పేర్కొంది. పర్యావరణ అనుమతులు తీసుకునే వరకు తవ్వకాలు చేపట్టరాదని ఉత్తర్వులు జారీ చేసింది. ఇసుక అంశం ఏపీలో ఎప్పుడూ సంచలనంగా మారుతోంది. తాజాగా ఉత్తర్వులతో ఎన్నికల సమయంలో ఏపీ ప్రభుత్వానికి మరింత ఇబ్బందికరంగా మారనుంది.

## మొదటి డివిజన్ బీఆర్ఎస్ నూతన మహిళా కమిటీ



✍ **జయభేరి, మేడిపల్లి :**
పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు నిర్మల ఆధ్వర్యంలో మొదటి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నూతన మహిళా కమిటీ అధ్యక్షురాలిగా ఈ.పల్లవి ని ఎన్నుకోవడం జరిగింది.
అనంతరం కమిటీ సభ్యులు మేయర్ జక్క వెంకట్ రెడ్డిని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.
కమిటీ సభ్యులు ఉపాధ్యక్షురాలు వై.శిరీష, మల్లిక, ప్రధాన కార్యదర్శి వై.సరస్వతి, సహాయ కార్యదర్శులు బి.నర్సమ్మ, లత, కోశాధికారి పారిజాత, సలహాదారులు పుష్ప, వాణిశ్రీ, వీణ. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు మేయర్ శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వం లోని బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, కంటి వెలుగు, వృద్ధాప్య, వితంతు పింఛన్ మొదలైన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అలాగే నేడు కాంగ్రెస్ పార్టీ 420 మోసపూరిత హామీలను ప్రజలకు వివరిస్తూ మల్కాజ్గిరి పార్లమెంట్ ఎన్నికల్లో రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు.

## ఆత్మ రక్షణకు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి

▸▸ బెల్టుల ప్రదానం చేసిన కోచ్,మాస్టర్స్ బాల్ రాజ్, అహ్మద్ ఖాన్.



✍ **జయభేరి, షాద్ నగర్ :**
నేటి అమ్మాయిలు, చిన్నారులు దృడంగా ఉండాలన్నా,ఎలాంటి భయం లేకుండా ఉండాలన్నా ప్రతి అమ్మాయిలు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సూచించారు న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ అహ్మద్ మాస్టర్ కోచ్,పులిందర్ మాస్టర్, బాల్ రాజ్ మాస్టర్ పట్టణంలోని ఆదర్శ కాలనీలో బెల్టుల ప్రధానోత్సవ పోటీలు నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా ఆయా విభాగాలలో వైట్ ,ఎల్లో,ఆరెంజ్ , గ్రీన్, బ్లూ, బ్రౌన్, బ్లాక్ బెల్టులకు సంబందించిన టెస్టులు నిర్వహించారు.అనంతరం విద్యార్థులకు బెల్టులను మాస్టర్ అహ్మద్ ఖాన్ లతో కలిసి ప్రదానం చేశారు.ఈ సందర్భంగా బాల్ మాస్టర్ మాట్లాడుతూ,,ప్రతి ఒక్క చిన్నారులు బలంగా,దృడంగా, ధైర్యంగా ఉండాలంటే కచ్చితంగా మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని కోరారు. ముఖ్యంగా అమ్మాయిలు కచ్చితంగా మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు,తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

# గిరిజన భూములను కబ్జా చేసిన బీఆర్ఎస్ దొంగలు

- సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించే స్థాయి నీది కాదు మధుకర్
- ఇంకా అధికారంలో ఉన్నామని బ్రమ పడుతున్న బిఆర్ఎస్ నాయకులు
- ప్రతిపక్ష హోదా లేకుండా చేస్తాం
- మూడు చింతలపల్లి వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్ రెడ్డి
- పేదల భూములను ఇష్టానుసారంగా కబ్జా చేశారు - మంద శ్రీనివాస్ రెడ్డి

**జయభేరి, ఏప్రిల్ 29 :-**

అమాయక గిరిజన భూములను రాత్రి కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న దొంగలు మాజీ మంత్రి మల్లారెడ్డి, ఆయన అనుచరులేనని డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి నోటికొచ్చినట్లుగా మాట్లాడితే సహించేది లేదని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మూడు చింతలపల్లి మండల వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. మూడుచింతలపల్లి మండలంలోని కొల్తూర్ గ్రామంలో మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన రైతులతో మాట్లాడారు. మాజీ మంత్రి మల్లారెడ్డి నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల భూములను కబ్జా చేశారని ఆరోపించారు. అబద్ధపు, వాగ్దానాలు, హామీలతో గద్దెనెక్కి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. అదేవిధంగా బీఆర్ఎస్ నేతలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇస్తే బీఆర్ఎస్ ను కాంగ్రెస్ లో విలీనం చేస్తానని చెప్పిన కేసీఆర్ తర్వాత మాట మార్చారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతలు ఇప్పటికి కూడా తాము అధికారంలో ఉన్నామని భ్రమ పడుతున్నారని, వారంతా తెలంగాణ ప్రజలను నిలువునా దొచుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతర విద్యుత్ ను సరఫరా చేస్తుందని, దీనిపై బీఆర్ఎస్ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, గ్రామ అధ్యక్షుడు నర్సారెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, విష్ణు గౌడ్, నర్సింహా, భూపాల్ రెడ్డి, గురువయ్య, రాజేంద్రప్రసాద్, వేణు గోపాల్ రావ్, జెర్రిపోతుల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.








## రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయం

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, కాప్రా :**

మల్కాజ్ గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయం అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కాప్రా డివిజన్ BRS పార్టీ యువ నాయకుడు బైరీ నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి గూడలో ఇంటింటా ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ ప్రచారం లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీ తో గెలిపించాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 4 నెలలు గడుస్తున్నా రాష్ట్రానికి చేసింది ఏమి లేదు అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షుడు బద్రుద్దీన్, డివిజన్ అధ్యక్షులు సుడుగు మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గిల్బర్ట్ , సోషల్ మీడియా అధ్యక్షుడు బైరీ భాస్కర్ గౌడ్, మహిళ నాయకులు సరోజ, సుజాత, భాను, సార తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ కోసం పోరాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్

- ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



**జయభేరి, మేడ్చల్ :**

తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం పోరాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్ అమరం జైపాల్ రెడ్డి అన్నారు. మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ సోమవారం కౌన్సిలర్ అమరం జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో 11వ వార్డులో ఇంటింటా ప్రచారం చేశారు. గడప గడపకూ వెళ్లి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ దొంగ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంపీ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలే ఇప్పటికి అమలు అవుతున్నాయి తప్ప కొత్తగా ఏ పథకం కూడా ఆచరణలోకి రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అమరం హేమంత్ రెడ్డి, భేరి బాలరాజు, నాయకులు జనార్ధన్ రెడ్డి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, ఉపాధ్యక్షుడు దప్పు మహేష్, నర్సింగ్ రావు, ప్రవీణ్ రెడ్డి, రమేష్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ అభివృద్ధి కోసం మరోసారి నరేంద్రమోదీ



**జయభేరి, మేడ్చల్ :**

దేశ అభివృద్ధి కొరకై ప్రజలందరూ కేంద్రలో మరోసారి నరేంద్రమోదీ బీజేపీ సర్కారుకు మద్దతుగా నిలబడాలని మేడ్చల్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం ఈటల రాజేందర్ కు మద్దతుగా మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు ఉషిగారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిదిలోని 6వ వార్డు మైసమ్మగూడలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి బిజెపి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు ఖాయమని అన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ సాబ్ కా సాత్ సాబ్ కా వికాస్ నినాదంతో అన్ని వర్గాలను అభివృద్ధి పరుస్తూ ప్రపంచంలోనే భారతదేశాన్ని ప్రథమ స్థానంలో నిలిపారని అందుకే నరేంద్రమోదీ మరోసారి ప్రధానమంత్రి గెలవడం ఖాయమన్నారు. మల్కాజిగిరి నుండి పోటీ చేస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కారోన విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక సేవలు చేశాడని లాంటి నాయకుడికి అందరూ మద్దతుగా కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్ , అమరం సరస్వతి నవనీత బూత్ అధ్యక్షుడు రాజు, నర్సింగ్, నవీన్,కృష్ణా, నరేష్, వెంకటేష్, శ్రీకాంత్, యాదగిరి, అరుణ్,నరేష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత సమ్మర్ క్యాంపులు ప్రారంభం




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ క్యాంపులు డాన్స్, కరాటే, పాలిటెక్నిక్ కోచింగ్. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనము నందు ప్రతి సంవత్సరం సమ్మర్ క్యాంపులు నిర్వహించడం జరుగుతున్నది. అదే విధంగా ఈ సంవత్సరం మే 1 నుండి ఉచిత సమ్మర్ క్యాంపులు ప్రారంభం అగును. కావున ప్రతి ఒక్కరూ ఈ యొక్క సదా అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, మా వద్ద నేర్చుకున్న విద్యార్థి విద్యార్థినీలు జాతి అంతర్జాతీయ స్థాయిలో వెళ్లడం గెలుపొందడం ఎన్నో విజయాలు సాధించినారు. మా యొక్క దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ సర్టిఫికెట్ రిజర్వేషన్ కలదు. ఈ మండుతున్న ఎండాలలో పిల్లలు బయట తిరగకుండా ఒకటే చోట ఉండాలన్నా కూడా ఇది మంచి అవకాశం! మీ పిల్లలు శారీరికంగా మానసికంగా దృఢంగా ఉండాలంటే క్రీడలలో కానీ డ్యాన్స్ లో కానీ మాస్టర్ ఆర్ట్స్ లో కానీ ప్రతిరోజు నేర్చుకుంటే ఎంతో యాక్టివ్గా పిల్లలు ఉంటారు. పాలిటెక్నిక్ కోచింగ్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ దేవరకొండ వారి సౌజన్యంతో కోచింగ్ ఇవ్వబడును.



## భాజాపాతోనే అన్ని వర్గాల సంక్షేమం

- శానంపూడి సైదిరెడ్డి, బిజెపి పార్లమెంట్ అభ్యర్థి

**జయభేరి, దేవరకొండ :**

ప్రతి బూత్ లెవెల్ లో భారతీయ జనతా పార్టీకి అత్యధిక ఓట్లు రావాలని నల్లగొండ బిజెపి పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. సోమవారం దేవరకొండ పట్టణంలోని టిటిడి కళ్యాణమండపం లో బూత్ లెవెల్ ఆఫీసర్ల సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేశారు.భారతీయ జనతా పార్టీ దేవరకొండ నియోజకవర్గం బూత్ అధ్యక్షులు,కోఆర్డినేటర్, బూత్ లెవెల్ ఆఫీసర్ల సమ్మేళన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి,జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, పార్లమెంట్ ప్రబారి చాడ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.బిజెపి అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ అధికారంలోకి రావడం ఖాయమని, ప్రతి ఒక్కరూ గడపగడపకు బిజెపి కార్యక్రమంలో కార్యకర్తలు విస్తృతంగా పాల్గొని నరేంద్ర మోడీ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ కమలం పువ్వు పై ఓటు వేయాలని ప్రజలను కోరాలని బూత్ అధ్యక్షులకు, కోఆర్డినేటర్లకు, మార్గ నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతావత్ లాలు నాయక్ , కర్నాటి సురేష్ , జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు కార్యదర్శి , జిల్లా ఉపాధ్యక్షులు వనం నరేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వాస్కుల సుధాకర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకురి నరసింహ, ఎస్టి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లేష్ నాయక్, గిరిజన మోర్చారాష్ట్ర మీడియా కన్వీనర్ వినోద్ రాథోడ్,ఓ బి సి మోర్చా నేతల వెంకటేష్, మాజీ పార్లమెంట్ కన్వీనర్ నక్క వెంకటేష్ యాదవ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నరసింహారావు, సర్పంచ్ బొడ్డు శీను కౌన్సిలర్ లక్ష్మి పట్టణ అధ్యక్షులు గుండాల అంజయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు బూత్ అధ్యక్షులు కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారి అదృశ్యం

**జయభేరి, మహబూబ్ నగర్:**

మహబూబ్నగర్ మండలం బొక్కలోనిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి మూడేళ్ల బాలుడు అదృశ్యం కావడం మిస్టరీగా మారింది. రాత్రి తల్లిదండ్రుల వద్ద నిద్రిస్తున్న బాలుడు ఉదయం లేచి చూసే సరికి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు జాగిలాల సహాయంతో గ్రామంలో గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసు జాగిలాల రైల్వే లైన్ వరకు వెళ్లి నిలిచిపోయాయి. బాలుడిని ఎవరైనా ఎత్తుకువెళ్లారా లేక జంతువులు దాడిచేసి ఎత్తుకెళ్లాయా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు..

## గడప గడపకు కాంగ్రెస్

- సునీత మహేందర్ రెడ్డికి మద్దతుగా కండ్లకోయలో కాంగ్రెస్ ప్రచారం
- ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నేత సింగిరెడ్డి నవీన్ చందర్ రెడ్డి

**జయభేరి, మేడ్చల్ :**



ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 120 రోజుల్లోనే ఆరు గ్యారెంటిలను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి నవీన్ చందర్ రెడ్డి అన్నారు. సోమవారం మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి కి మద్దతుగా కండ్లకోయ మాజీ సర్పంచ్ కందాడి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిదిలోని కండ్లకోయలో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటిలను ప్రజలకు వివరిస్తూ ఎంపీ ఎన్నికల్లో సునీత మహేందర్ రెడ్డి ని బలపరుస్తూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అనంతరం సింగిరెడ్డి నవీన్ చందర్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యమౌతుందన్నారు. దేశంలో బిజెపి పార్టీకి నూకలు చెల్లాయని ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో ప్రజలు విసుగు చెందారని ఆయన విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి ప్రజలు లోకసభ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్, మాజీ సర్పంచ్ లు బండారి నరేందర్, కందాడి నరేందర్ రెడ్డి, భేరి ఈశ్వర్, నాయకులు గడిలా కృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేష్ ముదిరాజ్, కర్రల స్వామి, గౌస్ ఖాన్, రాజేందర్, వెంకటేష్, బాపురెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆనంద్, అరవింద్, యాదయ్య, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.




## నూతన సమన్వయ కమిటీల ఏర్పాటు

**జయభేరి, మేడిపల్లి :**




పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు బండారి రవీందర్ అధ్యక్షతన కార్పొరేటర్ కొల్తూరి మహేష్, నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, జావీద్ ఖాన్ ఆధ్వర్యంలో నూతన సమన్వయ కమిటీల ఏర్పాటులో భాగంగా నిర్వహించిన సమావేశంలో మైనార్టీ నాయకులు, కార్యకర్తలు,పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాలొన్ని సమగ్రంగా చర్చించి నగర మైనార్టీ నూతన అధ్యక్షుడిగా షేక్ జీలానీ పాషా ను ఎన్నుకోవడం జరిగింది. అనంతరం కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. మైనారిటీ ప్రధాన కమిటీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ జాకీర్, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ సుభాన్, వైస్ ప్రెసిడెంట్ మొహమ్మద్ అజీమ్ ఉద్దీన్, మొహమ్మద్ ఖైజర్, షేక్ ఇబ్రహీం, సంయుక్త కార్యదర్శి సయ్యద్ ఉమర్ అలీషా, ఆర్గనైజింగ్ సెక్రటరీ మొహమ్మద్ అక్రమ్ ఉద్దీన్, కోశాధికారి మొహమ్మద్ నయీం.

మైనారిటీ యువజన కమిటీ అధ్యక్షుడు మహ్మద్ వసీం, ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ నయీం, వర్కింగ్ ప్రెసిడెంట్ మొహమ్మద్ నజీర్, వైస్ ప్రెసిడెంట్ షేక్ జమాల్, షేక్ మునవ్వర్, మహమ్మద్ వజాహత్, సంయుక్త కార్యదర్శి సయ్యద్ షఫీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ మునీర్, కోశాధికారి మొహమ్మద్ మన్సూర్. ఈ సందర్బంగా మేయర్ మాట్లాడుతూ.... మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లిం అభ్యున్నతికి ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని అందులో భాగంగా పేద, మధ్యతరగతికుటుంబాలకు షాదీ ముబారక్,ఇమామ్ మౌజన్ లకు గౌరవ వేతనం, మైనారిటీ గురుకుల పాఠశాలలు, సబ్సిడీ లోన్స్, ముఖ్యంగా దేశంలో ఎక్కడ లేని విధంగా పేద ముస్లింలకు రంజాన్ తోఫా ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన మొదటి రంజాన్ లోనే తోఫా ఇవ్వడం ఆపివేసి ముస్లింలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఏంటో చెప్పకనే చెప్పినట్టుందని కావున ముస్లింల సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే రేపు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్గిరి బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజారిటీ తో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏనుగ మనోరంజన్ రెడ్డి, ముస్లిం నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభాత జయభేరి



# వలపు విరుపుల పెదవుల నిర్మాణ రీతిని బట్టి.. మనిషి తీరు

చంద్రవదనంలో కండ్ల తర్వాత కనువిందు చేసేవి అధరాలే! అరవిరిసిన పెదాలపై పదాలు కట్టిన కవికుల తిలకులు ఎందరెందరో! మోవి గని మొగ్గ అని వర్ణించిన వారు కొందరైతే, గులాబీ రేకులే పెదాల సోకు అని తీర్మానించారు ఇంకొందరు. ముత్యాల పలు వరుసకు కెంపుల పరదాల్లాంటి అధరాల వైనాన్ని వివరించే శాస్త్రమూ ఉంది. అదే లిపాలజీ! వలపు విరుపుల పెదవుల నిర్మాణ రీతిని బట్టి.. ఆ మనిషి తీరును ఇది వివరిస్తుంది.

**పలుచటి పెదాలు:**
పూల రేకుల్లా సన్నని పెదాలున్న వాళ్లు ఇట్టే ఆకట్టుకుంటారు. ఈ తరహా అధరాలు ఉన్నవాళ్లు తమతో తాము గడపడానికి అధిక ప్రాధాన్యం ఇస్తారట. జీవిత భాగస్వామితో సంతోషంగా ఉండటానికి ప్రయత్నిస్తారని లిపాలజీ ఉవాచ.

**ముద్ద మందారం:**
ముద్దిచ్చే పెదాలు ముద్ద మందారంలా నిండుగా ఉన్నవాళ్లు.. మెండు మనసు కలిగి ఉంటారని లిపాలజీ చెబుతున్నది. అయితే వీళ్లు చిన్నచిన్న విషయాలకే భంగపడి బుంగమూతి పెట్టుకుంటారట.


పప్పీ పెదాలు:
ఒత్తుగా, పెద్దగా ఉండే పెదాలను పప్పీ లిప్స్ అంటారు. ఈ తరహా పెదవులు ఉన్నవాళ్లు విశాల హృదయం కలిగి ఉంటారు. వీళ్లకు సాటివారిపై సానుభూతి ఎక్కువ. జంతువులను అమితంగా ప్రేమిస్తారట కూడా!

**పువ్వు విచ్చుకున్నట్టు:**
ఇలాంటి పెదాలు ఉన్నవారు చాలా ఆకర్షణీయంగా కనిపిస్తారు. వీళ్ల మనస్తత్వం స్థిరంగా ఉంటుందట. అందంగా మాట్లాడటమే కాదు, ఎదుటివారు చెప్పింది మనస్ఫూరిగా వింటారని సెలవిస్తుంది లిపాలజీ.

**స్టింగ్ లిప్స్:**
చిన్నగా, ఉబ్బెత్తుగా ఉండే పెదాలున్నవాళ్లలో స్వార్థం పాలు ఎక్కువగా ఉంటుందట. మాయమాటలు చెప్పేవారిని త్వరగా నమ్మేస్తారు. ఆ మాటలు తమకు హాని కలిగించేవి అయితే అప్రమత్తం అవుతారట.

**పై పెదవి పెద్దగా:**
కింది పెదవి కన్నా.. పై పెదవి పెద్దగా ఉన్నవాళ్లు వినమ్రులుగా ఉంటారని పెదాల శాస్త్రం పలుకుతున్నది. వీళ్లు నిజాయతీగా ఉంటారు. వీరిలో సెన్సాఫ్ హ్యూమరూ ఎక్కువే!

**కింది పెదవి పెద్దగా:**
పై పెదవి కన్నా.. కింది పెదవి పెద్దగా ఉన్నవాళ్లకు సాహస కృత్యాలంటే ఇష్టం ఉంటుందట. కొత్త పరిచయాలు చేసుకోవాలనే ఆసక్తి వీళ్లలో అధికం. తరచూ ప్రయాణాలు చేయాలని కోరుకుంటారు.







# కోల్‌కతా కమాల్


## రాణించిన చక్రవర్తి

## సాల్ట్ ఢిల్లీపై ఘన విజయం

**కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. గత మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ చేతిలో ఘోర ఓటమి ఎదుర్కొన్న కోల్‌కతా.. సొంత ఇలాఖా ఈడెన్‌గార్డెన్స్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ భరతం పట్టింది. వైభవ్ అరోరా ఆదిలోనే ఢిల్లీని దెబ్బకొట్టగా, మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి మిడిల్‌ను కుప్పకూల్చాడు. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన క్యాపిటల్స్.. ఆఖర్లో కుల్దీప్‌యాదవ్ బ్యాటింగ్‌తో పరువు దక్కించుకుంది. లక్ష్యఛేదనలో ఫిల్‌సాల్ట్ బౌండరీలతో దుమ్మురేపితే.. శ్రేయాస్ అయ్యర్, వెంకటేశ్ అయ్యర్ గెలుపు లాంఛనాన్ని పూర్తి చేశారు. ఈ విజయంతో ప్లేఆఫ్స్ బెర్తుకు మరింత చేరువ కాగా, ఢిల్లీ మరో ఓటమిని ఖాతాలో వేసుకుంది.**

ఈడెన్‌గార్డెన్స్‌లో చప్పగా సాగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై కోల్‌కతా నైట్‌రైడర్స్‌దే పైచేయి అయ్యింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ 7 వికెట్ల తేడాతో ఢిల్లీపై భారీ విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన ఢిల్లీ.. బ్యాటింగ్ ఎంచుకుంది. గత మ్యాచ్‌లో రికార్డులు బద్దలైన వేళ ఈ మ్యాచ్‌లోనూ పరుగుల వరదే అనుకున్న అభిమానులకు నిరాశే ఎదురైంది. వరుణ్ చక్రవర్తి(3/16), హర్షిత్ రానా(2/28), వైభవ్ అరోరా(2/29) ధాటికి ఢిల్లీ 20 ఓవర్లలో 153/9 స్కోరు చేసింది. కుల్దీప్‌యాదవ్(35 నాటౌట్) టాప్ స్కోరర్‌గా నిలువగా, ప్రధాన బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు.
భీకరమైన ఫామ్‌లోఉన్న జేక్ ఫ్రేజర్(12) తీవ్రంగా నిరాశపరిచాడు. గాయం నుంచి కోలుకుని జట్టులోకి వచ్చిన అరోరా..ఢిల్లీని ఘోరంగా దెబ్బకొట్టగా, మిగతా పనిని చక్రవర్తి పూర్తి చేశాడు. ఆ తర్వాత స్వల్ప లక్ష్యఛేదనలో కేకేఆర్ ఓపెనర్ ఫిల్ సాల్ట్(33 బంతుల్లో 68, 7ఫోర్లు, 5 సిక్స్‌లు) జట్టుకు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. పసలేని ఢిల్లీ బౌలింగ్‌ను చీల్చిచెండాడుతూ సాల్ట్ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(33 నాటౌట్), వెంకటేశ్ అయ్యర్(26 నాటౌట్) రాణించారు. అక్షర్‌పటేల్(2/25)కు రెండు వికెట్లు దక్కాయి. చక్రవర్తికి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీకి సరైన శుభారంభం దక్కలేదు.
కోల్‌కతా ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశిద్దామనుకున్న ఢిల్లీని ఆదిలోనే వైభవ్ అరోరా దెబ్బతీశాడు. ఓపెనర్ పృథీషా(13)ను ఔట్ చేసి ఢిల్లీ వికెట్ల పతనానికి నాంది పలికాడు. షాట్ ఆడబోయిన షా..కీపర్ సాల్ట్‌కు క్యాచ్ ఇచ్చి తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. లీగ్‌లో సూపర్ ఫామ్‌మీదున్న జేక్ ఫ్రేజర్‌ను సాల్ట్ పెవిలియన్ సాగనంపాడు. దీంతో ఢిల్లీ 30 పరుగులకే ఓపెనర్లను కోల్పోయింది. ఆ తర్వాత క్రీజులోకొచ్చిన అభిషేక్ పోరెల్(18), షాయి హోప్(6) విఫలమయ్యారు. హోప్‌ను అరోరా క్లీన్‌బౌల్డ్ చేస్తే..పోరెల్..రానాకు వికెట్ సమర్పించుకున్నాడు. ఇన్నింగ్స్ నిలబెట్టేందుకు ప్రయత్నించిన కెప్టెన్ రిషబ్ పంత్(27) క్రీజులో నిలదొక్కుకోలేక పోయాడు. వరుణ్ బౌలింగ్‌లో శ్రేయాస్‌కు క్యాచ్ ఇచ్చి ఐదో వికెట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత అక్షర్‌పటేల్(15), స్టబ్స్(4), కుశాగ్ర(1) ఘోరంగా నిరాశపరిచారు. ఆఖర్లో కుల్దీప్‌యాదవ్ బ్యాటు ఝులిపిస్తూ ఐదు ఫోర్లు, ఒక సిక్స్ కొట్టడంతో ఢిల్లీ 150 పరుగుల మార్క్ అందుకుంది. లేకపోతే స్వల్ప స్కోరుకు పరిమితయ్యేది. ఢిల్లీ నిర్దేశించిన స్వల్ప లక్ష్యఛేదనను కోల్‌కతా ఆడుతూ పాడుతూ ఛేదించింది. ఓపెనర్ సాల్ట్ మొదటి నుంచే ఢిల్లీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. లిజార్డ్ విలియమ్స్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే ఢిల్లీ ఓటమి ఖరారైంది. ఈ ఓవర్లో 23 పరుగులు వచ్చాయి. ఖలీల్ అహ్మద్ తొలి ఓవర్ మొదటి బంతికే సాల్ట్ ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపడ్డాడు. సాల్ట్ ఇచ్చిన క్యాచ్‌ను విలియమ్స్ విడిచిపెట్టడంతో లైఫ్ దక్కింది. ఇక అక్కణ్నుంచి వెనుదిరిగి చూసుకోని సాల్ట్ బౌండరీలతో చెలరేగాడు. బౌలర్ ఎవరన్నది లెక్కచేయని సాల్ట్ ఈ క్రమంలో 26 బంతుల్లోనే అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. దీంతో పవర్ ప్లే ముగిసే సరికి వికెట్ కోల్పోకుండా 79 పరుగులు చేసింది. అక్షర్ బౌలింగ్‌లో సునీల్ నరైన్(15) ఔటయ్యాడు. మూడో డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన రింకూసింగ్(11) నిరాశపరిచినా..శ్రేయాస్, వెంకటేశ్ మరో వికెట్ పడకుండా జాగ్రత్తపడుతూ జట్టును గెలుపు తీరాలకు చేర్చారు. వీరిని విడదీసేందుకు పంత్ ప్రయత్నించినా..ఢిల్లీ పేలవ ఫీల్డింగ్ అవకాశాలను దెబ్బతీసింది.

**సంక్షిప్త స్కోర్లు**
ఢిల్లీ: 20 ఓవర్లలో 153/9(కుల్దీప్ 35 నాటౌట్, పంత్ 27, చక్రవర్తి 3/16, రానా 2/28),
కోల్‌కతా: 16.3 ఓవర్లలో 157/3(సాల్ట్ 68, శ్రేయాస్ 33 నాటౌట్, అక్షర్‌పటేల్ 2/25, విలియమ్స్ 1/38)



# శారీరక, మానసిక సమస్యలకు ఇలా చెక్

**శారీరక ఆనందంతోపాటు మానసిక ఉల్లాసాన్ని అందించేది కళ. చక్కని సంగీతం హాయినిస్తుంది. అలాగే నృత్యం , చిత్రకళ, ఇతర లలిత కళలు మనిషి ఎదుగుదలకు దోహదం చేస్తాయి. జ్ఞానేంద్రియాలను ప్రేరేపించే ఈ కళలతో మనసుకు కూడా ప్రశాంతత చేకూర్చవచ్చంటున్నారు నిపుణులు. అందుకే వీటిని థెరపీలుగా కూడా ఉపయోగిస్తున్నారు. తద్వారా శారీరక, మానసిక సమస్యలకు చక్కని పరిష్కారం చూపుతున్నారు.**


**సంగీత సాధన**
శ్రావ్యమైన సంగీతం వింటే తెలియకుండానే మనసు తేలికపడుతుంది. జర్నల్ ఆఫ్ మ్యూజిక్ థెరపీలో ప్రచురితమైన ఓ పరిశోధన ప్రకారం ఆందోళన, దీర్ఘకాలిక బాధలు, నొప్పుల నుంచి సంగీతంతో ఉపశమనం కలుగుతుంది. ఒత్తిడిలో ఉన్నప్పుడు నచ్చిన గాయకుల పాటలు వినడం వల్ల కొంత ఉపశమనం లభిస్తుంది.

**కళతో భళా!**
ఆర్ట్ థెరపీ ఒకరకమైన మానసిక చికిత్స. మానసిక అనారోగ్యాన్ని సరిచేయడానికి, ఆందోళన, నిరాశ తగ్గించడానికి ఈ థెరపీ ఉపయోగిస్తారు. క్యాన్సర్‌తోపాటు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడే రోగులకు ఆర్ట్ థెరపీ చక్కని ఔషధం. బొమ్మలు గీయడం, వాద్య పరికరాలు, సంగీతం సాధనచేయడంతో శారీరక రుగ్మతను జయించిన వాళ్లు ఎందరో ఉన్నారు. వైద్యానికి అనుబంధంగా ఆర్ట్ థెరపీ తీసుకుంటే.. ఫలితం మెరుగ్గా ఉంటుందని నిపుణుల మాట.

**స్టెప్పేస్తే..**
డ్యాన్స్ ఉరిమే ఉత్సాహాన్ని ఇస్తుంది. నృత్యాన్ని చూసినా, చేసినా మానసికంగా మేలైన మార్పు కలుగుతుంది. నృత్యం వల్ల కలిగే శారీరక శ్రమ ఆరోగ్యానికి మేలు చేస్తుందని చెబుతున్నారు నిపుణులు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి కూడా డ్యాన్స్ థెరపీ ఒక మార్గం. ముఖ్యంగా ఊబకాయం, మధుమేహంతో బాధపడుతున్న వాళ్లు స్టెప్పేస్తే... అనారోగ్యం తోకముడవడం ఖాయం.

**నలుగురితో కలిసి**
నలుగురితో కలివిడిగా ఉండటం, మనసులో మాట పంచుకోవడాన్ని పబ్లిక్ ఆర్ట్ అంటారు. జర్నల్ ఆఫ్ ఎపిడెమియాలజీ అండ్ కమ్యూనిటీ హెల్త్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం.. నచ్చిన ప్రదేశంలో, ఇష్టమైన మనుషుల మధ్య గడపడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందట. మానసిక ఆరోగ్యం బాగాలేనప్పుడు విహారానికో, యాత్రలకో వెళ్లమని వైద్యులు సూచించడం వెనుక ఆంతర్యం కూడా ఇదే!

# మూవీభేరి



## నా డ్రీమ్ రోల్ అదే..

### మలబార్ సోయగం మాళవిక

సోషల్ మీడియాలో మలబార్ సోయగం మాళవిక మోహనన్ క్రేజ్ ఏ రేంజ్‌లో ఉంటుందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఎప్ప టికప్పుడు హాట్ హాట్ లుక్స్‌తో నెటిజన్లను కట్టిపడేస్తుంటుంది. ఈ నెట్టింట ఏదైనా పోస్ట్ పెట్టిందంటే చాలు.. లైక్స్, కామెంట్ల వర్షం కురుస్తుంటుంది. మాళవిక మోహనన్ ప్రస్తుతం తెలుగులో ప్రభాస్‌మారుతి కాంబోలో వస్తున్న హారర్ కామెడీ ప్రాజెక్ట్ రాజాసాబ్‌లో ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. తాజాగా ఈ భామ #AskMalavika సెషన్‌లో పాల్గొంది. ఈ సందర్భంగా ఫా లోవర్లు, అభిమానులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చిం ది. మీకు ఎలాంటి డ్రీమ్ రోల్‌లో నటించాలని ఉందని ఓ నెటిజన్ అడిగాడు. దీనికి మాళవిక స్పందిస్తూ.. నేను గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటించాలనుకుంటున్నా. ఓ యువతిని కూల్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో చూడటం ఆసక్తికరంగా ఉంటుంది. నిజమేనా..? ఇప్పుడు నేను యాక్షన్ సీక్వెన్స్‌లో ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకున్నా. యాక్షన్ పార్టుకు సంబంధించి నన్ను మరింత ఎలివేట్ చేసుకోవ డం ఫన్‌గా ఉంటుందని ట్వీట్ చేసింది మాళవిక మోహనన్. ఈ ట్వీట్‌తో మాళవిక మోహనన్ నుంచి రాబోయే రోజుల్లో మరిన్ని యాక్షన్ సినిమాలు వస్తాయని అర్థమవుతోంది. మరి ఈ భామ కోసం ఎవరైనా దర్శకనిర్మాతలు యాక్షన్ ఓరియెంటెడ్ సబ్జెక్టులు పట్టుకొస్తారా..? అనేది రానున్న రోజుల్లో తెలుస్తుంది. మాళవిక ప్రస్తుతం విక్రమ్ హీరోగా నటిస్తోన్న తంగలాన్‌లో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ భామ పోర్చుగల్ వెకేషన్‌లో అందమైన ఐలాండ్ ప్రాంతంలో బ్లాక్ షాట్ డ్రెస్‌లో స్టైలిష్ గాగుల్స్ పెట్టుకుని దిగిన త్రోబ్యాక్ స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.



## ఒకే పాటలో ముగ్గురు భామలతో

# ఆడిపాడనున్న ప్రభాస్

ఒకేపాట.. ఒకే హీరో.. ఇద్దరు హీరోయిన్లు.. ఇది ఒకప్పుడైతే కామన్. ఇప్పుడు ఆ ట్రెండ్ లేదు. అయితే.. ప్రభాస్ కొత్త ట్రెండ్‌కి తెరలేపారు. ఆయన నటిస్తున్న 'రాజా సాబ్' సినిమాలో ఏకంగా ముగ్గురు భామలతో ఆడిపాడనున్నారు. నిధి అగర్వాల్, రిద్ధి కుమార్, మాళవిక మోహనన్.. ఈ ముగ్గురూ ఒకే పాటలో ప్రభాస్‌తో స్టెప్పులేయనున్నారట. 'మిర్చి' తర్వాత ప్రభాస్ హీరోయిన్లతో స్టెప్పులేయలేదు. మారిన ఇమేజ్ కారణంగా ఆ తరహా సినిమాలకు దూరమయ్యారనే చెప్పాలి. ఇప్పుడు దర్శకుడు మారుతీ పుణ్యమా అని మళ్లీ 'మిర్చి' నాటి ప్రభాస్‌ను తెలుగు ప్రేక్షకులు చూడబోతున్నారని విశ్వసనీయ సమాచారం. అభిమానులతో ఈలలు వేయించే డాన్స్ మూమెంట్స్‌తో ఈ పాట ఉండనుందని తెలుస్తున్నది. పైగా ప్రభాస్ నటిస్తున్న తొలి కామెడీ హారర్ మూవీ 'రాజా సాబ్'. మారుతీ 'ప్రేమకథా చిత్రం' తరహాలో హారర్‌తో పాటు అద్భుతమైన కామెడీ కూడా ఇందులో ఉంటుందట. ప్రభాస్ లాంటి సూపర్‌స్టార్‌తో ఇలా కామెడీ హారర్ సినిమా తీయడం నిజంగా ప్రమోగమే అని చెప్పాలి. సంజయ్‌దత్ ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నాడు.



## గేమ్ ఛేంజర్ షూటింగ్

# సంగతేంటి..?

టాలీవుడ్ స్టార్ యాక్టర్ రాంచరణ్ టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం గేమ్‌ఛేంజర్. స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహి స్తున్నాడు. పొలిటికల్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శంకర్ తన కూతురు వెడ్డింగ్ నేపథ్యం లో షూటింగ్‌కు విరామం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన ఆసక్తికర వార్త తెరపైకి వచ్చింది. నేడు గేమ్ ఛేంజర్ కీలక షెడ్యూల్ పూర్తయింది. సునీల్, నవీన్ చంద్ర, రాంచర ణ్‌పై వచ్చే సన్నివేశాలను చిత్రీకరించినట్టు ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు కొత్త షెడ్యూల్‌ను మే 1 నుంచి చెన్నైలో మొదలు పెట్టనున్నారని సమాచారం. ఈ షెడ్యూల్‌లో యాక్షన్ ఎపిసో డ్స్‌ను చిత్రీకరించనున్నారట.

ఈ చిత్రంలో రాజోలు సుందరి అంజలి, టాలీవుడ్ యాక్టర్లు నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, బాలీవుడ్ నటుడు హ్యారీ జోష్, కోలీవుడ్ యాక్టర్లు ఎస్‌జే సూర్య, సముద్రఖని, కన్నడ నటుడు జయరాయ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తె రకెక్కిస్తున్నారు. గేమ్ ఛేంజర్‌కు పాపులర్ డైరెక్టర్ కార్తీక్ సు బ్బరాజు కథనందిస్తుండగా.. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ అందిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యా క్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



## మంచు విష్ణు కన్నప్పలో

# మిల్కీబ్యూటీ ప్రత్యేకగీతం ?

మోహన్‌బాబు నిర్మిస్తున్న 'కన్నప్ప' సినిమా నక్షత్రాల పాలపుంతను తలపిస్తున్నది. మంచు విష్ణు టైటిల్‌రోల్ చేస్తున్న ఈ మైథలాజికల్ మూవీలో సూపర్‌స్టార్లయిన శివరాజ్‌కుమార్, అక్షయ్‌కుమార్, ప్రభాస్‌లు కీలక పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా మరో సూపర్‌స్టార్ కూడా ఈ ప్రాజెక్ట్‌లో చేరారట. ఆయనే మోహన్‌లాల్. ఇందులో ఆయన ఆదివాసీ తెగకు చెందిన ఓ నాయకుడి గా కనిపిస్తారని వినికిడి. ఇదిలావుంటే.. తమన్నా భాటియా కూడా 'కన్నప్ప'లో భాగం అయినట్టు తెలుస్తున్నది. ఇందులో ఓ ప్రత్యేక గీతంలో ఆమె మెరవనున్నదట. రజనీకాంత్ 'జైలర్' సినిమాలో ఆమె చేసిన స్పెషల్ సాంగ్ ఎంతటి సంచలనాన్ని సృష్టించిందో తెలిసిందే. ఇప్పుడు 'కన్నప్ప'లో కూడా ఆమె స్పెషల్ సాంగ్ చేస్తున్నదని ఫిల్మ్ వర్గాల సమాచారం. అయితే.. ఆ వార్తపై అధికారిక ప్రక టన మాత్రం ఇంకా రాలేదు. ముఖేష్‌కుమార్ సింగ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న విషయం విదితమే.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com